## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కిషన్‌బాగ్ ఓహెచ్, ఆర్ష్ మహల్, బిలాల్‌నగర్, అంజదుల్లాబాగ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. బహదూర్‌పురా ఓహెచ్, కిషన్‌బాగ్ ఏబీసీ, ఘాజిబండ, చందులాల్ బారాదరి విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**సుల్తాన్‌బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..**

అఫ్జల్‌గంజ్: 11 కేవీ సుల్తాన్‌బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని హనుమాన్ టేక్డీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, బడిచౌడీ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రామకృష్ణ, మోతీ మార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని రామకృష్ణ థియేటర్, ట్రూప్ బజార్ లేన్, జనరల్ పోస్ట్ ఆఫీస్, సంఘం హోటల్, నింబోలి అడ్డా, టాకిజల్, హనుమాన్ ఆలయం, ఏకే పేపర్, రైల్వే ట్రాక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

## మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన ప్రవీణ్ కుమార్



యాకుత్‌పురా: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సెట్విన్ శిక్షణ సంస్థ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్ కుమార్ టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి ధన్యవాదలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం పై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రత్యేక పూజలు



లాల్‌దర్వాజా అమ్మవారిని దర్శించుకున్న కొప్పుల ప్రవీణ్ కుమార్

చాంద్రాయణగుట్ట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన కొప్పుల ప్రవీణ్ కుమార్ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు కె.విష్ణుగౌడ్, చంద్రకుమార్, వినోద్, రాజ్ కుమార్, నర్సింగ్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి.ఎల్.నర్సింగ్ గౌడ్, బోయ నగేష్, ఎం.మోహన్ రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శ్రీకాంత్ ముదిరాజ్, సందీప్ గౌడ్ తదితరులు ఆయనను సన్మానించారు.

## మంత్రి వివేక్‌కు సత్కారం



సుల్తాన్‌బజార్: మాల సామాజిక వర్గానికి చెందిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి రావడంపై తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డేరా బాలకిషన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి వివేక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యంత వెనుకబడిన మాల ఉపకులాల అభ్యున్నతి కోసం తెలంగాణ మాల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రమణీయం అదితి భరతనాట్యం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం శ్రీవారి పాదాలు ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఎస్.రమాదేవి శిష్యురాలి అదితి సర్దా భరతనాట్య ఆరంగేట్రం బుధవారం రవీంద్ర భారతిలో కనుల పండువగా జరిగింది. పుష్పాంజలి, అలరింపు, హంసధ్వని, జతిస్వరం, వంటి పలు అంశాలపై, అన్నమయ్య కీర్తనలకు చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శృతిజ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకులు ఆర్.విష్ణుప్రియ, రాజేష్ నారాయణ్‌తో పాటు అదితి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పేరుకే 100 ఫీట్లు.. వాహదారులకు తప్పని పాట్లు

- కుంచింకుపోతున్న వంద ఫీట్ల జాతీయ రహదారి
- అక్రమ కార్ఖానాలో షెడ్‌లతో 50 ఫీట్ల రోడ్డు స్వాహా
- గార్డెన్ నుంచి గిర్కపల్లి వరకు సింగిల్ దారిలో రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





వంద ఫీట్ల జాతీయ రహదారి

జియాగూడ: పురానాపూల్ నుంచి రామ్‌సింగ్‌పురా వరకు గల వంద ఫీట్ల జాతీయ రహదారి 50 ఫీట్లకు కుంచించుకుపోయింది. పురానాపూల్ నుంచి కేసరి హనుమాన్ వరకు రెండు దిక్కులా రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో వాహనదారులు ఎదురుపడి ఢీ కొడుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. పట్టించుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ, హైడ్రా ఈ ప్రాంతం రావాలంటే నిర్లక్ష్యం వహిస్తున్నారు.

**గార్డెన్ నుంచి గిర్కపల్లి వరకు ఆక్రమణ..**

వంద ఫీట్ల జాతీయ రహదారిలో మూసీని కబ్జా చేయడంతో పాటు 100 ఫీట్లలో 50 ఫీట్ల రోడ్డును సైతం ఆక్రమించి షెడ్లు, కార్ఖానాలు, అక్రమ పార్కింగ్‌లు, ఫర్నీచర్ ఫ్యాక్టరీలకు అనుకూలంగా కబ్జా చేశారు. మరో దిక్కు మూసీని సైతం స్వాహా చేస్తున్నారు. ఇందులో నాయకులు, స్థానికులు, ప్రజా ప్రతినిధులు ఉండడం విశేషం. అసలే జియాగూడ, కార్వాన్ ఇరుకు రోడ్ల కారణంగా ట్రాఫిక్‌ను మూసీ నది పక్క నుంచి వంద ఫీట్ల జాతీయ రహదారిని ప్రభుత్వం నిర్మించి, అప్పట్లో రెండు రహదారులను వాడుకల్లో ఉండగా, క్రమేణా షెడ్లు నిర్మించి కార్ఖానాలు వేసుకొని రహదారికి చెందిన వన్‌సైడ్ రోడ్డు పూర్తిగా కబ్జా చేసి వాహనాల పార్కింగ్, సామగ్రి దుకాణాలను పూర్తిగా వాడుకుంటున్నారు. దీంతో భారీ వాహనాలు ఎస్.బి.ఏ గార్డెన్ నుంచి గిర్కపల్లి వరకు ఎదురెదురు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

**ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి..**

జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. నగరం నుంచి ట్రాఫిక్‌ను మళ్లించడానికి నిర్మించిన 100 ఫీట్ల జాతీయ రహదారి సగానికి పైగా కబ్జాలకు గురికావడం బాధాకరం. దీని కారణంగా ఎప్పటికీ ట్రాఫిక్ సమస్య జాతీయ రహదారిలో పరిష్కారం కాలేదు. జాతీయ రహదారిలో బస్టాప్ కిసాన్ స్థలం కేటాయించగా కేశవస్వామినగర్ మూలలో కబ్జాకు గురి కాగా ప్రయాణికులు రోడ్డుపైన నిలిచిఉంటున్నారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకొని రోడ్డు ఇరువైపులా రాకపోకలను సౌకర్యంగా తీర్చిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం



ప్రారంభోత్సవంలో నగేష్, శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నగేష్ తెలిపారు. నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో రూ.11.50 లక్షలతో అధునాతనంగా నిర్మించిన స్నానాల గదులను గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాళమోని శ్యాంరావు ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకుపోతుందన్నారు. నల్లవాగు శ్మశాన వాటికకు అంత్యక్రియల నిర్వహణకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పెరోజీ సాయినాథ్, సాయిలు, ప్రదీప్, వీరేందర్, జయలక్ష్మి, జయమ్మ, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణలో కాంగ్రెస్‌కు తిరుగులేదు'



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న అప్సర్ యూసుఫ్ జాహీ

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్‌కు తిరుగులేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన అప్సర్ యూసుఫ్ జాహీ బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసే వారికి పార్టీ ఎప్పుడూ మరచిపోదన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దేశం గర్వపడేలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ పథకాలు ఉన్నాయన్నారు.

## పీస్ ఫోర్స్ సొసైటీని మరింత బలోపేతం చేస్తాం

గోల్కొండ: పీస్ ఫోర్స్ సొసైటీని మరింత బలోపేతం చేస్తామని సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. బుధవారం టోలిచౌకీలోని పీస్ ఫోర్స్ సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా శాంతి భద్రత పరిరక్షణ కోసమే పీస్ ఫోర్స్ సొసైటీ స్థాపించామన్నారు. స్థానిక పోలీసులకు సహకరిస్తూ తాము 15 ఏళ్లుగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలు, వినాయక నిమజ్జన ఊరేగింపులు శాంతియుతంగా జరిగేలా పీస్ ఫోర్స్ సొసైటీ కార్యకర్తలు పోలీసులకు సహకరిస్తున్నారన్నారు. కార్యకర్తలు ముజాహిద్, మహ్మద్ ఫహద్, ఇస్మాయిల్, ఖాలేద్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

## ఆషాఢ బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: ఆషాఢ బోనాలను పురస్కరించుకొని గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కై లాష్ గంగపుత్ర అధ్యక్షతన నిర్వహించారు. ఆలయంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్మనీ కై లాష్ గంగపుత్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.ఎస్.ఆనంద్ రావు, కోశాధికారిగా బొడ్డు సాయిబాబా, ఎంగలి రాజు, ముఖ్య సలహాదారులుగా ఎస్.మల్లేషం గౌడ్, సలహాదారులుగా భాగ్యలక్ష్మి, పాశం సురేందర్, ఆలే జితేంద్ర, కె.సదానంద్, ఉపాధ్యక్షులుగా ఆలే భాస్కర్‌రాజ్, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గాలి ప్రభాకర్, చర్మాణి రూప్‌రాజ్, టి.వెంకటేశ్ గౌడ్, మామిడికృష్ణ, వై.రామకృష్ణ, ఎం.ప్రకా/ శ్, పి.ప్రకాశ్ రాజ్, టి.మాణిక్ రావు, బి.వై.శ్రీకాంత్, ఎం.రమేశ్ తదితరులను ఎన్నుకున్నారు.



పురస్కార గ్రహీతలతో బాబుమోహన్ తదితరులు

## ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకం

గన్‌ఫౌండ్రీ: మహా కవి సినారె కళా పీఠం ఆధ్వర్యంలో టీజీఎస్‌ఆర్టీసీ సికింద్రాబాద్ రిజియన్ పరిధిలో ప్రమాద రహిత సేవలు అందించిన డ్రైవర్లకు బుధవారం రవీంద్రభారతిలో ఉత్తమ సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సినీ నటుడు బాబుమోహన్ మాట్లాడుతూ..ఆర్టీసీ సంస్థలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సికింద్రాబాద్ జోన్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ ఎస్.సుచరిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు పోరెడ్డి రంగయ్య, కళాపీఠం అధ్యక్షుడు ఎం.రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల గిడ్డంగిని పర్యవేక్షించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

అబిడ్స్: చుడిబజార్‌లోని ఎన్నికల గిడ్డంగిని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సీఈఓ సుదర్శన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. త్రైమాసిక పరిశీలనలో భాగంగా ఎన్నికల గిడ్డంగిని రాష్ట్ర జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు.

## 'బడిబాట'ను విజయవంతం చేయాలి



యాకుత్‌పురా: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అనురుద్ రావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన సుల్తాన్‌షాహిలోని బేరూన్ గౌలిపురా, చందులాల్ బేలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విజయ్ భాస్కర్, సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## డీఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభ

నాంపల్లి: దళితుల హక్కుల పరిరక్షణకు దళిత్ లీడర్‌షిప్ ఫోరం (డీఎల్‌ఎఫ్) ఆవిర్భావం, ప్రారంభోత్సవ సభ బుధవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. డీఎల్‌ఎఫ్ చైర్మన్ సురేష్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై ప్రారంభించారు. సభా ప్రారంభంలో అంబేడ్కర్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. బహుజన సమాజ్ నేత నల్లా సూర్య ప్రకాష్, డిబిసి చెన్నై కన్వీనర్ డాక్టర్ సి.లక్ష్మణ్, ఏఎస్‌కేఈఎస్ వ్యవస్థాపక చైర్మన్ కొల్లూరి సత్తయ్య, సామాజిక కార్యకర్త జి.రాజారామ్, ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మేరీ మాదిగ హాజరై ప్రసంగించారు.

## దారి దోపిడీ కేసులో యువకుడి అరెస్టు

విజయనగర్‌కాలనీ: దారి దోపిడీ కేసులో ఓ యువకుడితో పాటు ఓ మైనర్ బాలుడిని అరెస్టు చేసిన ఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ కె.విజయశ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నడికుడ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం..హబీబ్‌నగర్ మల్లేపల్లి అఫ్జల్‌సాగర్‌కు చెందిన సయ్యద్ రెహాన్(18) మెకానిక్ షాప్‌లో హెల్పర్. అతనికి ఓ మైనర్ బాలుడు స్నేహితుడు. వీరు డబ్బుల కోసం ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులను కత్తితో బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి సెల్‌ఫోన్లు, నగదు, దొంగిలిస్తుంటారు. కాగా ఈ నెల 8న తెల్లవారుజామున 3 గంటలకు దొంగిలించబడిన హోండా యాక్టివాపై ఆసిఫ్‌నగర్ జేబాబాగ్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ కారు నడిపిస్తున్న డ్రైవర్ అమ్జదుల్లాను చిరునామా అడిగినట్లు నటిస్తూ అతనికి కత్తిచూపి ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి ఫోన్‌ను, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.


## అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాదాపు రూ.40 లక్షలలో నిర్మించ తలపెట్టిన అభివృద్ధి పనులను ఆయన కార్పొరేటర్ ఎం.శశికళకృష్ణతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతకు ముందు మహాలక్ష్మీనగర్, గంగబౌలి, శివ మందిర్‌రోడ్, హాయ్ మౌంట్ స్కూల్ మోహన్‌లాల్ గ్యారేజ్ రోడ్డు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు రమేష్, శ్రీధర్, చంద్రమోహన్, రవీందర్ సింగ్, సురేష్, అమర్నాథ్, సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

## కోట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బాబురాజా




చార్మినార్: కోట్లా అలీజాలోని కోట మైసమ్మ ఆలయ కమిటీకి నూతన కార్యవర్గం ఏర్పడింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా రాయి కోటి బాబురాజా, ఉపాధ్యక్షులుగా కె.రాజ్ కుమార్, ఏ.యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అశోక్ యాదవ్, కార్యదర్శిగా ఎస్.విజయ్ గౌడ్, కోశాధికారిగా ప్యారసాని వెంకటేష్ తదితరులతో కార్యకర్గం ఏర్పడింది. ఈ సందర్భంగా బాబురాజా మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామన్నారు.

## చట్టవిరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

అబిడ్స్: గుడిమల్కాపూర్ పరిధిలోని క్లాసిక్ గార్డెన్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా డీజే మ్యూజిక్ ఏర్పాటు చేసిన నిర్వాహకులపై గుడిమల్కాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం..నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం ధ్వని కాలుష్యం వెదజల్లే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఉన్నాయన్నారు. క్లాసిక్ గార్డెన్ ఫక్షన్‌హాల్ యజమానులు డీజేలను ఏర్పాటు చేసి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తుండడంతో ఎస్ఐ ఆబిద్ అలీ ఫంక్షన్‌హాల్‌పై దాడులు నిర్వహించి డీజేను సీజ్ చేశారు. నిర్వాహకులపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజు మాట్లాడుతూ..ఎవరైన చట్టవిరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

## సన్మానం



గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా నూతనంగా నియమితులైన అల్లం భాస్కర్, కొప్పుల ప్రవీణ్ కుమార్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ యాకుత్‌పురా ఏ-బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శశి యాదవ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



నిఖిల్‌దాస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోల్కొండ కోట కందకాలు ఇతర చారిత్రక ప్రదేశాలపై ఆయనతో మాట్లాడారు. దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత కోట కందకాల్లో పూడిక తీయలేదన్నారు. ఈ కందకాలు పిచ్చి మొక్కలతో వ్యర్థాల డంపింగ్‌తో అధ్వానంగా తయ్యారయ్యాయన్నారు. కోట దర్వాజాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కటోరా హౌజ్‌తో పాటు కందకాల పూడికతీత కోసం ఎన్‌ఓసీ ఇస్తే బల్దియా వారు వాటిని శుభ్రం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బంజారి దర్వాజా వద్ద సైకిల్‌కేబుల్ ప్రాజెక్టు కోసం ఎన్‌ఓసీ ఇవ్వాలన్నారు. ఎన్‌ఓసీ ఉంటే గ్రేటర్ మున్సిపల్ వారు సైకిల్‌కేబుల్ ప్రాజెక్టు కోసం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కటోరా హౌజ్, కోట కందకాలు సుందరీకరిస్తే కోటకు వచ్చే పర్యాటకులు కూడా పెరుగుతారన్నారు. అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా నిఖిల్ దాస్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

## గోల్కొండ కోట బోనాలకు సహకరిస్తాం



మల్లేశానికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు సహకరిస్తామని గోల్కొండ కోట కన్జర్వేషన్ అసిస్టెంట్ మల్లేషం అన్నారు. ఈ నెల 26న జరిగే మొదటి బోనం సందర్భంగా రిసాల బజార్ నుంచి ప్రారంభమైయ్యే జులూస్‌కు రావాలని కోరుతూ వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి బుధవారం ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాలు జరిగే రోజున ప్రవేశ రుసుము వసూలు చేయమన్నారు. అంతేకాకుండా దేవాదాయ శాఖ వారు కోటలో ఏర్పాట్లకు కూడా తాము పూర్తిగా సహకరిస్తున్నామన్నారు. కాగా దశాబ్దాల నుంచి తాము మొదటి బోనం రోజున జులూస్ నిర్వహిస్తున్నామని వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు సాయిబాబాచారి అన్నారు. కార్యక్రమంలో మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.

## కేఎస్‌నగర్‌లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' ర్యాలీ



జియాగూడ: అంగన్‌వాడీ ప్రాముఖ్యత తెలియజేస్తూ చిన్నారులను చేర్పించే క్రమంలో కలిగే లాభాల గురించి వివరిస్తున్నామని అంగన్‌వాడీల సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. బుధవారం జియాగూడలోని కేశవస్వామి నగర్ అంగన్‌వాడీ-1 అంగన్‌వాడీ టీచర్ కల్పన ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహారం పండి తినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండున్నర సంవత్సరాల పిల్లలను నమోదు చేసుకోవడంతో పాటు ఐదేళ్ల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లులకు తెలిపారు.

## పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, కొండా సురేఖల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాలకు దూపదీప నైవేద్య పథకం ద్వారా పేద అర్చకులకు ప్రతి నెలా ఎంపిక చేసిన ఆలయాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయడంపై అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన అర్చకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ మాట్లాడుతూ..ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి అర్చకుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో అర్చకులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు అండగా టీఎన్జీఓ యూనియన్



సమావేశంలో విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్

అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓ యూనియన్ ఉంటుందని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.విక్రమ్‌కుమార్, సెక్రెటరి కుర్రాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో పలు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, అధ్యక్షులు జగదీశ్వర్‌రావు సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మురళీరాజు, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కోశాధికారి బాల్‌రాజ్, ఇతర నాయకులు నరేష్‌కుమార్, ఖలీద్ అహ్మద్, సుజాత, గీతాసింగ్, ముకీమ్ ఖురేషి, వైదిక్ శాస్త్రి, ప్రభాకర్ పాల్గొన్నారు.